www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 18 డిసెంబర్ 2024

5

కాకినాడ



21న పిఠాపురంలో మినీజాబ్ మేళా

పిఠాపురం: ఈ నెల 21న పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'మినీ జాబ్ మేళా' నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీలలో వివిధ ఉద్యోగాలలో పనిచేయడానికి ఎస్ఎస్సి, ఇంటర్, ఎనీ డిగ్రీ, డి/బి/ఎం ఫార్మసీ పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి రెజ్యూమ్, ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో 21న ఉదయం 10 గంటలకు హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 86399 51441, 99491 56583 నంబర్లను సంప్రదించాలన్నారు.

రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్న కేంద్రం

- జమిలికి సిపిఎం పూర్తి వ్యతిరేకం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ
- డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం

కేంద్రంలోని బిజెపి సర్కారు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని, రాష్ట్రాల హక్కులను హరించేస్తుందని, మతోన్మాదాన్ని పెంచిపోషిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ అన్నారు. సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా తొలి మహాసభ అమలాపురం ప్రెస్‌క్లబ్ లోని పచ్చిమాల వసంతకుమార్ నగర్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా తొలుత సిపిఎం పతాకాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకులు పీతల రామచంద్రరావు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పచ్చిమాల వసంతకుమార్ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాతర ఎస్.బలరామ్, కె.కృష్ణవేణి, బివి.రాఘవులు అధ్యక్షవర్గంగా ప్రతినిధుల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ ప్రారంభోపన్యాసం చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఈ విధానాలను ప్రతిఘటించాలన్నారు.

జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ద్వారా బిజెపి అజెండాను రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్ని తాకే స్థాయిలో ఉన్నాయన్నారు. కేరళ తరహాలో 13 రకాలు వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం అధికంగా ఉందన్నారు. ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్తులన్నీ అదానీ, అంబానీలకు అప్పగిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ జమిలి ఎన్నికలను కేంద్రం తెరపైకి తెచ్చిందన్నారు. దీనికి సిపిఎం పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం ప్రజలు ఉపయోగించే వస్తువులపై జిఎస్‌టి భారాన్ని మోపుతుందన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. విభజన హామీలను పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. పోలవరం నిర్వాసితులను గాలికొదిలేసిందన్నారు. రాజధాని నిర్మాణానికి పట్టెడు మట్టితో సరిపెట్టిందని విమర్శించారు. కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్రానికి ద్రోహం తలపెట్టిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తుందని, అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు.

అనంతరం సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మూడేళ్ల నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లాలో వరదలు సంభవించిన సమయంలో పార్టీ తరపున అనేక మందిని ఆదుకున్నామని తెలిపారు. అంగన్‌వాడీలు సుదీర్ఘకాలం సమ్మె చేశారన్నారు. ప్రజా గర్జన, ప్రజా పోరు, ఇంటింటికీ సిపిఎం వంటి కార్యక్రమాలతో ప్రజా సమస్యలపై పోరాడమన్నారు. బుధవారంతో మహాసభ ముగుస్తుందన్నారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు అమలాపురం గడియార స్తంభం సెంటర్లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకుల ఆంధ్ర మాల్యాద్రి, జిల్లా నాయకులు జి.దుర్గాప్రసాద్, నాగవరలక్ష్మి, డాక్టర్ చల్లా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.





ఏచూరికి నివాళులర్పిస్తూ...



ప్రారంభోపన్యాసం చేస్తున్న సుబ్బరావమ్మ



అరుణపతాకాన్ని ఆవిష్కరిస్తున్న పీతల రామచంద్రరావు



బుక్ లెట్ ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు రాజశేఖర్, బేబిరాణి, తదితరులు

'నమో అదానీ - కరెంటు కహానీ' బుక్‌లెట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

పెరుగుతున్న విద్యుత్ భారాలకు కారణాలు, అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ రచించిన 'నమో అదానీ -కరెంటు కహానీ' అనే బుక్ లెట్ను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు జి. బేబీరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిండెన్ బర్గ్ రిపోర్ట్ వచ్చినప్పుడే అదానీ సంస్థలపై విచారణ జరిపించి ఉండాల్సిందన్నారు. దేశ సంపదను అదానీకి కట్టబెట్టడమే ధ్యేయంగా మోడీ పని చేస్తున్నారని విమర్శించారు. అమెరికాలో అదానీ కంపెనీపై కేసు నమోదు అయిన తరువాత కూడా పాలకుల మౌనం వహించడం వెనుక అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. జగన్ హయాంలో అదానీ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం రద్దు చేయడానికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై స్మార్ట్‌గా విద్యుత్ భారాలు మోపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఈ బుక్ లెట్ ను చదివి చైతన్య వంతులై పాలకులను ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు సిహెచ్. రాజకుమార్, మలకల వెంకట రమణ, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. బుక్ లెట్ కొరకు కచేరిపేట సుందరయ్య భవన్‌లో గాని, 9490098974, 9553804358 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

మృతుల కుటుంబాలకే పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ

1996లో కోనసీమ ప్రాంతంలో వచ్చిన తుపానులో వేటకు వెళ్లి మరణించిన మత్స్యకార కుటుంబాల వారికే పరిహారం అందివ్వాలని ఎపి రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లంకే మహేష్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆ సమయంలో వేటకు వెళ్లి 2,600 మంది వరకూ మరణించారని, వారిని గుర్తించి తమ సంస్థ ఇన్సూరెన్స్ పరిహారం కోసం సుమారు 28 ఏళ్లకు పైగా వివిధ దశల్లో న్యాయపోరాటం చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఆయన వివరించారు. ఈ సందర్భంగా లంకే మహేష్ విలేకరులతో మాట్లాడారు. నాటి మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని తమ సంస్థ ఆధ్వర్యంలో న్యాయ పోరాటం చేస్తుందన్నారు. హైకోర్టు తీర్పును అనుసరించి 1996లో చనిపోయిన మృతుల వారసులను తమ సంక్షేమ సంస్థ ద్వారా ఇంటింటికి వెళ్లి గుర్తించి వారి పేర్లను రెవెన్యూ, ఇన్సూరెన్స్ వారికి ఇస్తామని చెప్పారు. చనిపోయిన మత్స్యకార కుటుంబాల వారు ఎవరైనా ఉంటే కాకినాడ జగన్నాధపురం, చిన్న మార్కెట్ సాయిబాబా గుడి వద్ద ఉన్న తమ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కర్రి నాగవేణి, మత్స్యకార మతుల కుటుంబాలకు చెందిన వారసులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న లంకే

ఇంజినీరింగ్ కార్మికులకు ఎల్ఐసి సంఘం మద్దతు

ప్రజాశక్తి - పెద్దాపురం

దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఎల్ఐసి ఉద్యోగుల సంఘం మద్దతు తెలిపింది. మంగళ వారం స్థానిక మున్సిపల్ సెంటర్లోని సమ్మె శిబిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులకు ఎల్ఎసి ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఉద్యోగుల సంఘ కార్యదర్శి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగులు అతి తక్కువ వేతనాలు పొందుతున్నార న్నారు. అటువంటి కార్మికులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘ నాయకులు ఎన్‌విఎస్.ఈశ్వర్‌చంద్, ఎం.దత్తు, ఎబిఎన్. సోమరాజు, వేణుగోపాలరావు, పి.బాలాజీ, ఇంజనీరింగ్ కార్మిక సంఘ నాయకులు సుంకర నాగేశ్వరరావు, రమణ, రామకృష్ణ, స్వామి, భాస్కర్, భద్ర రావు, సాయికృష్ణ, జి.నాగేశ్వరరావు, ఎస్‌కె బషీర్, ఎన్.శివ, ఎం.భద్రరావు, రవిచంద్రకుమార్, సతీష్, సత్తిరాజు, శ్రీను పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతు ఇస్తున్న ఎల్ఐసి ప్రతినిధులు

జీడిపిక్కల కార్మికులకు న్యాయవాదుల మద్దతు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కలు ఫ్యాక్టరీ వెంటనే తెరిపించాలని కార్మికులు చేస్తున్న ఉద్యమానికి న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. ఫ్యాక్టరి వద్ద జరుగుతున్న 32వ రోజు ధర్నా శిబిరాన్ని మంగళవారం ఆలిండియా లాయర్స్ ఫర్ జస్టిస్ రాష్ట్ర నాయకులు బుగతా శివ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టాల సాకుతో జీడిపిక్కలు ఫ్యాక్టరీ మూసివేయడం దురదృష్టకరమన్నారు. ఫ్యాక్టరీ మూసివేయడంతో 24 గ్రామాలకు చెందిన 409 మంది రోడ్డున పడ్డ కార్మికుల కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే వరకూ జరిగే పోరాటాలకు తాము అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆకాశపు నాగమల్లేశ్వరరావు, సిఐటియు వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు, కార్మిక నాయకులు ఎ.వీర బాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, కాంతారావు, వీరబాబు, ఎస్ విజయలక్ష్మి, టి.దేవి, అన్నపూర్ణ, ఎం.లక్ష్మీదుర్గ, వై.నాగమణి పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న న్యాయవాది శివ

టిడ్కో కాలనీల్లో మౌలిక వసతుల కల్పన

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

రాష్ట్రంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కూటమి నాయకులతో కలిసి స్థానిక వాలు తిమ్మా పురం రహదారిలోని టిడ్కో గృహ సముదా యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆయనతో మాట్లాడారు. కాలనీలో పిచ్చి మొక్కలు పెరిగిపోయా యన్నారు. గుమ్మాలు, కిటికీలు చెదలు పడుతున్నాయని, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అనేక గృహాలకు విద్యుత్ సదుపాయం సైతం లేక చీకటి పడితే కాలనీలో తిరగడానికి భయపడు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఛైర్మన్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించేందుకు కృషి చేస్తామ న్నారు. గత వైసిపి ప్రభుత్వం టిడ్కో కాలనీల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కాలనీలను అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అలాగే సామర్లకోట- పిఠాపురం రోడ్లో ఉన్న టిడ్కో గృహాల సముదాయాలను టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కాలనీలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన టిడ్కో గృహ సము దాయాలు వద్ద మౌలిక వసతులను మెరుగుపరిచి 100% లబ్ధిదారులు ఇళ్లలో చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పర్యటనలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగ నాగ్, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్య దర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, జనసేన పట్టణ అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, సామర్లకోట మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యార్లగడ్డ రవిచం ద్రప్రసాద్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు, పాల్గొన్నారు.



సామర్లకోటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

రక్తదాత అజహర్‌కు సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ఖిద్మత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం 44వసారి రక్తదానం చేసిన జనాబ్ అజహర్‌కి రెడ్ క్రాస్ కార్యదర్శి శివకుమార్, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థి హాసన్ షరీఫ్ మాట్లాడుతూ కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీలో ప్రతి నెల తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తం అవసరం అవుతుందన్నారు. అందుచేత వారికోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సభ్యులు అయినా అజహర్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తన వంతుగా వారికి అవసరమైన ఫలహారం, రక్తదానం చేస్తూ యువకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. రెడ్ క్రాస్ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు చిష్టి, కార్యదర్శి హుస్సేన్, సభ్యు లు మౌలానా ఎహితిషాముల్ హక్, నవాబ్, మణిదీప్ పాల్గొన్నారు.



రక్తదాతను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - పిఠాపురం

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మణికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఉప్పాడ బస్ స్టాండ్‌లోని చిన్నమాంబ పార్క్‌లో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్లో ఎవరైనా బ్యాంకు ఖాతా వివరాలు, ఓటిపి అడిగితే చెప్పొద్దన్నారు. ఫోన్, మెయిల్ ద్వారా వచ్చే తెలియని వెబ్‌సైట్ల లింకులను ఓపెన్ చేయొద్దన్నారు. డిజిటల్ లావాదేవీలు జరిపేటప్పుడు, తెలియని వ్యక్తుల వద్ద నుంచి లింక్స్, మెసేజెస్, ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. అటువంటి అనుమానాస్పద ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ మణికుమార్

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్లను మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ శాఖ అధికారులు, ఆదాని సిబ్బంది బిగించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ జెఇ నాగరాజు విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ వల్ల ఎంత విద్యుత్ వినియోగం అవుతుంది, విద్యుత్ బిల్లు రీడింగ్, ఓవర్ లోడ్ వంటి అంశాలు తెలియడమే కాకుండా మొబైల్ ఫోన్ రీఛార్జ్ లాగా విద్యుత్తు రీఛార్జ్ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. త్వరలో అన్ని గృహాలకు ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోలార్ విద్యుత్ సౌకర్యం ఉన్న గృహాలకు కూడా ఉచితంగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ టివివి సత్యనారాయణ, ఎల్.ఐ. అప్పారావు, ఆదాని సిబ్బంది పాల్గొన్నారు.



పంచాయతీకి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఎంఎంఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన పలు కుటుంబాలకు ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు మంగళవారం ఆర్థిక సాయాన్ని అందించారు. మంగళవారం ఆయన ఆసుపత్రిలో ఉన్న బాధితులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆపదలో ఉన్న వారిని ఎంఎంఆర్ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు, పోకనాటి వెంకన్న, బొల్లు నాగేశ్వరరావు, మాగపు శివ పాల్గొన్నారు.



రోగి కుటుంబ సభ్యులకు నగదును అందిస్తున్న ముదునూరి

19, 20 తేదీల్లో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 19, 20 తేదీల్లో స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పురుష విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 100 మంది బాక్సర్స్, కోచ్ మేనేజర్లు, టెక్నికల్ అఫీషియల్ 50 మంది కలిపి మొత్తం 150 మంది పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న బాక్సర్స్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారిని జనవరి నెలలో ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అవుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారందరికీ భోజనం, వసతిని ఏర్పాటు చేశామన్నారు.

18 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు : జెసి

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ నెల 18 నుంచి 23 వరకూ డిపార్ట్‌మెంటల్ పరీక్షలను నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్ ఇతర శాఖల అధికారులతో కలిసి ఎపిపిఎస్‌సి డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఏర్పాట్లపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 23 వరకు ఎపిపిఎస్‌సి ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు డిపార్ట్మెంటల్ పరీక్షల నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి రెండు పరీక్షా కేంద్రాలు కాకినాడ పట్టణం ఎస్. అచ్చుతాపురం రైల్వే ట్రాక్ దగ్గర ఉన్న ఆయాన్ డిజిటల్, కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెం వద్దనున్న సాఫ్ట్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఐదు గంటల వరకు రెండు పూటలా డిస్క్రిప్ట్, బహుళైచ్ఛిక పద్ధతుల్లో పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 8:30 నిమిషాల నుంచి 9:30 నిమిషాల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 1:30 నుంచి 2:30 వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తమ వెంట తీసుకురావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారి కె. సురేష్, ఎఎస్ఓ వైవిఎస్.నారాయణ, కాకినాడ ఆర్‌డిఓ కార్యాలయం ఎఓ ఠాగూర్, కాకినాడ అర్బన్, రూరల్ తహశీల్దార్లు జితేంద్ర, ఎస్ఎల్ఎన్.కుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్




పట్టణ మహిళా అధ్యక్షురాలు కుసుమను అభినందిస్తున్న దొరబాబు

వైసిపి పట్టణ మహిళా అధ్యక్షురాలిగా కుసుమ

ప్రజాశక్తి - సామర్లకోట

వైసిపి పట్టణ మహిళా అధ్యక్షురాలుగా 2వ వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ నియమితులయ్యారు. మంగళవారం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరు దొరబాబు ప్రకటించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 2వ వార్డు కౌన్సిలర్‌గా జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన క్రమంలో ఆమె పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి పట్టణ మహిళా అధ్యక్షురాలుగా నియమించినట్లు తెలిపారు ఈ సందర్భంగా పాలిక కుసుమను మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఉబా జాన్‌మోజేష్, కౌన్సిలర్లు శేషారావు, తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా దవులూరు దొరబాబును ఆమె మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మామిడి చెట్టుకు మందు కొట్టడానికి ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందాడు. మంగళవారం మండలంలోని కొండవరం గ్రామానికి చెందిన బుర్ర బాపన్న (35) మామిడి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందారని బంధువులు తెలిపారు. మృతుడు పుట్టుకతోనే మూగ అని అన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కుటుంబ యజమాని మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం త్రీ రోడ్ సెంటర్లో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వాహనంలో తరలిస్తున్న 3.29 టన్నుల పిడిఎస్ బియ్యాన్ని ఎస్ఐ శివకృష్ణ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మామిడికుదురు నుంచి రావులపాలెం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎక్సైజ్ సిబ్బంది, ఇఎస్‌టిఎఫ్, కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 2800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. పెద్దాపురం మండలం మరలావ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 600 లీటర్లు, కాండ్రకోట గ్రామంలో 600 లీటర్లు, కట్టమూరు గ్రామంలో 1600 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసామన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ లక్ష్మీతులసి, ఇఎస్‌టిఎఫ్ సిఐ జి.వెంకటలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లు, చేతులు కట్టేసి చోరీ

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలం దుబచర్ల గ్రామంలో స్థానిక వేపచెట్టు వీధిలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి యజమాని కాళ్లు చేతులు కట్టేసి మూడు కాసుల బంగారం, రూ.30 వేల నగదును చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దూబచర్ల రిటైర్డ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, చీమకుర్తి భాస్కర వీరభద్ర వెంకటఅప్పలకృష్ణమూర్తి భార్య లక్ష్మీకాంతంతో కలిసి నివసిస్తున్నారు. కృష్ణమూర్తి భార్య అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. సోమవారం రాత్రి వారు నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న కృష్ణమూర్తిని, పనిమనిషి జిత్తిగ పెద్దింట్లు కాళ్ళు చేతులు తాళ్లతో కట్టి బంధించారు. ఇంట్లో ఉన్న మూడు కాసుల బంగారం, రూ.30 వేల నగదును అపహరించుకుపోయారు. పోలీసులకు సమాచారం అందడంతో ఐజి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్‌పి సుబ్బరాజు సిబిలు ఎన్.క్రిష్ణార్, నాగేశ్వర నాయక్, క్రైమ్ సిఐ రాంబాబు, ఎస్ఐలు రవీంద్ర, బాలాజీ, రమేష్ ఇతర సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - కడియం

కడియం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి యావజ్జీవ ఖైదు శిక్ష పడిందని సిఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. పితాని సత్తిబాబు కడియం మండలం వేమగిరితోటకు చెందిన బొంతు వెంకన్నను హత్య చేసిన కేసులో నిందితునిగా ఉన్నాడు. రాజమహేంద్రవరం ఫ్యామిలీ కోర్టులో ఈ కేసుకు సంబంధించి వాదోపవాదాలు జరిగాయి. నేరం రుజువు కావడంతో జీవితఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.మాధురి తీర్పు నిచ్చారన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 9 నెలలు జైలు శిక్షను విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పిపి పివివిఎస్‌బి.రాజు వాదనలు వినిపించారు. కడియం సిఐ పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

పట్టాలిచ్చిన భూములను ప్రజలకు అప్పగించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

గతంలో పట్టాలు ఇచ్చిన భూములను ప్రజలకు అప్పగించాలని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ పి.త్రినాథరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరంగి గ్రామంలో సర్వే నంబర్ 402/1లో రెండు చోట్ల 6.50 ఎకరాలు గ్రామకంఠం, పోరంబోకు భూములలో 2008లో ప్రజలకు పట్టాలు ఇచ్చారని నేటికి స్థలాలు అప్పగించలేదని తెలిపారు. అప్పటి నుంచి ఆ స్థలాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం ప్రస్తుతం స్వాధీనం చేసుకుని ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన సుమారు 70 ఎకరాల అసైన్డ్ భూమి అన్యాక్రాంతమైన భూములను తిరి గి పేదలకు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల మంగేష్, సిపిఎం నాయకులు వల్లు రాజబాబు, దుప్పి అదృష్టదీపుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

నాణ్యతా ప్రమాణాలు పెంచుతాం

ప్రజాశక్తి - పిఠాపురం

ప్రముఖ పుణ్య క్షేత్రం పాదగయ క్షేత్రంలో ప్రసాదంలో నాణ్యత ప్రమాణాలు మరింత మెరుగు పరుస్తామని దేవాదాయశాఖ ఆర్‌జెసి సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. పాదగయ క్షేత్రంలో పులిహోర ప్రసాదంలో పురుగులు అంటూ వచ్చిన కథనాలపై మంగళవారం వారు విచారించారు. ప్రసాదం తీసుకున్న వ్యక్తిని, ధార్మిక సంఘాల ప్రతినిధుల నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌జెసి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రసాదంలో పాడైన సరకులు వాడినట్లు వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని, సిసి కెమెరాలను కూడా పరిశీలిస్తామన్నారు. పూర్తి వివరాలను నివేదిక రూపంలో దేవాదాయశాఖ కమిషనర్‌కు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. .

డిసి ఎన్నికల్లోనూ కూటమి హవా

జిల్లాలో మంగళవారం జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ ఎన్నికల్లోనూ కూటమి హవా నడిచింది. అన్ని డిసి ఛైర్మన్ పదవులను టిడిపి, జనసేన పార్టీలకు చెందిన వారే ఎన్నికయ్యారు. ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాజులూరు మండల పరిధిలోని కోటిపల్లి డిస్ట్రిబ్యూషన్ అధ్యక్షులుగా కోలంక నీటి సంఘం అధ్యక్షులు దాట్ల విజయగోపాల్‌రాజు, కాజులూరు డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులుగా దుగ్గుదూరు అధ్యక్షులు లకాని కృష్ణచైతన్య, కరప మండలం సిరిపురం డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షు లుగా పెనుమళ్ల అధ్యక్షులు పేపకాయల నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఛైర్మన్లను కార్మిక శాఖ మంత్రి సుభాష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, పట్టభద్రుల నియోజకవర్గ కూటమి ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, పాల్గొన్నారు. **సామర్లకోట** అన్నవరపు నీటి వినియోగదారుల డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ ఛైర్మన్‌గా సామర్లకోట మండలం జి.మేడపాడు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు గోలి కృష్ణమూర్తి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసచౌదరి, మండల టిడిపి అధ్యక్షులు తోటకూర శ్రీనివాస, టిడిపి నాయకులు అభినందించారు.



కాజులూరు డిసి ఛైర్మన్లను అభినందిస్తున్న మంత్రి సుభాష్

తాళ్లరేవు తాళ్లరేవు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా వేగేశ్న భాస్కర రాజు, ఉపాధ్యక్షులుగా మొగలతుర్తి శ్రీనివాసరావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పటవల సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు కొత్తూరు కాశీశ్వరుడు కాజులూరు మండలం జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో ఉన్న డిసికి వెస్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, రామచంద్రపురం జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్‌కు కాశీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ధూళిపూడి బాబీ, నడింపల్లి వినోద్, వెలుగు బంటి గోవిందు, దంగేటి అప్పన్న అభినందనలు తెలిపారు. **యు.కొత్తపల్లి** భారీ నీటిపారుదల వ్యవస్థ డిస్ట్రిబ్యూటర్ పిబిసిడిసి-1 ఛైర్మన్‌గా మురాలశెట్టి సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం, ఎంఎల్‌ఎ పవన్ కళ్యాణ్, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ప్రతినిత్యం రైతులతో మమేకమై ఉంటానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంఎల్‌ఎ పంతం నానాజీ, మర్రెడ్డి శ్రీనివాస్‌లను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతులు తెలిపారు. **కరప** కరప నీటి వినియోగదారుల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా వేములవాడ నీటి సంఘం అధ్యక్షులు పుణ్యమంతుల గంగసత్యనారాయణ ఎన్నికయ్యారు. వైస్ ఛైర్మన్‌గా పెదపూడి మండలం సహపురం గ్రామానికి చెందిన మెర్ల వీరవెంకట ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ పంతం నానాజీని గంగ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భోగి రెడ్డి కొండబాబు, భోగి రెడ్డి గంగాధర్, పాట్నీడి విష్ణుమూర్తి, గరగ జిమ్మి పాల్గొన్నారు. **జగ్గంపేట** తోట వెంకటాచలం పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పంపిణీ సంఘం డిసిగా ఎన్‌పి.రాజేశ్వరరావు, జగ్గంపేట డిసిగా అడబాల భాస్కరరావు, వైస్ ఛైర్మన్‌గా యల్లపు దొరబాబు, పెద్దాపురం డిసిగా పాలకుర్తి లక్ష్మీపతిరావు, వైస్ ఛైర్మన్‌గా కుకూరి సత్యనారాయణ, ప్రత్తిపాడు ఛైర్మన్‌గా కాకిలేటి వీర్రాజు, వైస్ ఛైర్మన్‌గా కోలా గంగాధర్, తుని ఛైర్మన్‌గా కుర్ర వెంకటరమణ, వైస్ ఛైర్మన్‌గా వెలనాటి గంగాధర్ ఎన్నికయ్యారు. టిడిపి జిల్ల అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఎన్నికల తీరును పరిశీలించారు.



యు.కొత్తపల్లి పిబిసిడిసి ఛైర్మన్‌ను అభినందిస్తున్న పంతం నానాజీ



తాళ్లరేవు డిసి ఛైర్మన్‌ను అభినందిస్తున్న అభిమానులు




కరప డిసి ఛైర్మన్‌ను అభినందిస్తున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

నిబంధనల ప్రకారమే పాలన..!

-ఉద్యోగులకు మింగుడు పడని ఇఒ ఆదేశాలు

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానంలో నిబధనల ప్రకారమే పరిపాలన సాగాలని ఇఒ వీర్ల సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు దేవస్థానంలోని కీలక విభాగాలకు చెందిన ఉద్యోగులకు మింగుడు పడటం లేదు. దేవస్థానంలో పాలన, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా విభాగాల నుంచి ఏ ఫైల్ అయిన ముందుగా గుమస్తా నుంచి ప్రారంభం కావాలని ఇఒ ఆదేశాలు జారీ చేశారు. అక్కడ నుంచి సూపరిండెంట్, ఎఇఒ, ఎసి, డిసి స్థాయి వరకూ ఆ ఫైల్‌ను పరిశీలించి తరువాత ఫైనల్‌గా ఇఒకి రావాలనేది నిబంధన. ఆ రీతిలో ఫైల్ రావడంతో ప్రతీ ఒక్క విభాగం అధికారికి .జవాబీదారీతనం, పాదర్శకత ఉండేందుకు అవకాశం ఉంటుందనేది భావన. అయితే ఇప్పటి వరకూ విధులు నిర్వర్తించిన కొందరు అధికారులు రెండు, మూడు ఫైల్స్ మాత్రమే ఎసి, డిసికి పంపించాలని, కీలక విభాగాల ఫైల్స్ అన్ని నేరుగా తనకే పంపించాలని సంబంధిత నిబంధనలను పక్కన పెట్టేశారు. దీంతో ఎసి, డిసి స్థాయి అధికారులు ఉత్సవమూర్తులుగా మిగిలిపోయేవారు. దీని కితోడు జవాబి దారీతనం, పార దర్శకత లోపించి అనేక అక్రమాలకు ఆస్కారం ఉండేదని పలువురు నుంచి విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇఒగా నూతనంగా బాధ్యతలు స్వీకరిం చిన వీర్ల సుబ్బారావు గతంలో జరిగిన పాలనాతీరును పరిశీలించి ఆ విధానానికి స్వస్తి పలికారు. ఇకపై వివిధ విభాగాల నుంచి ప్రతి ఫైలు ప్రొసీజర్ ప్రకారం నిబంధనలు అనుసరించి ఫైల్ తన వద్దకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలతో కీలక విభాగం అధికారులకు మింగుడు పడకుండా పోయింది. అయితే దిగువ శ్రేణి అధికారులు, సిబ్బంది ఈ ఆదేశాల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇన్వెస్టిగేషన్ కేసులు, వాటి సంబంధించి రికార్డ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గంజాయి రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై అన్ని విద్యాసంస్థల్లో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మహిళా చట్టాలు, మహిళల స్వీయ భద్రతకు తీసుకోవాలసిన జాగ్రత్తలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యచరణతో బ్లాక్ స్పాట్ గుర్తించడం, స్టాపర్స్ ఏర్పాటు చేయడం, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం తదితర కార్యక్రమాలు చేపట్టి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డును పరిశీలించి ఎస్సైకి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారిని మర్యాదపూర్వకంగా చూసి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ పి.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

యానాం వార్తలు

సత్యభాస్కర్‌కి ఉత్తమ రైతు అవార్డు

ప్రజాశక్తి - యానాం



యానాం ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వర్తక సంఘం గౌరవ అధ్యక్షులు మాజేటి సత్యభాస్కర్ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారు. వ్యవసాయ, అనుబంధ రంగ విభాగాల్లో ప్రతి ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏరువాక ఫౌండేషన్ ప్రతి సంవత్సరం వ్యవసాయ వార్షిక అవార్డులను ప్రకటిస్తుంది. ఇందులోభాగంగా ప్రముఖ వ్యాపారవేత్త మాజేటి సత్యభాస్కర్‌ని ఉత్తమ రైతుగా గుర్తించి వరి సాగు పంటకు సంబంధించి ఆయనకు ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు యానాంలోనూ, తాళ్ళరేవు మండలం సుంకరపాలెంలో గల వ్యవసాయ భూములలో సాగుపై మక్కువతో తాను ఎక్కువగా వ్యవసాయం, వరిలో అధిక దిగుబడుల సాధనతో పాటు విత్తనోత్పత్తిలో కృషి చేస్తున్నట్లు చెప్పారు. యానాం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా, పుదుచ్చేరి రాష్ట్ర అగ్రికల్చర్ హైలెవెల్ కమీటీ సభ్యునిగా, స్టేట్ లెవెల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆన్ క్రాప్ ఇన్సూరెన్స్ (ఎస్ఎల్ సిఐ) సభ్యుడిగా పని చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో విజయవాడలో జరగబోయే అవార్డులు పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ సేవా పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు యానాం పరిసర ప్రాంతాలకు చెందిన వ్యవసాయ రంగ ప్రముఖులు, రైతులు, స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు.

నేడు అభా కార్డు నమోదు కార్యక్రమం

ప్రజాశక్తి - యానాం

ప్రతి ఒక్కరూ-ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డును తప్పనిసరిగా చేయించుకోవాలని వైద్యశాఖ అధికారి టి.రవిశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్డు చేయించుకునేవారు తమ వెంట ఆధార్ కార్డుకు లింకు కలిగిన మొబైల్ ఫోన్ తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

నేడు శేషగిరిరావు శత జయంతి సభ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రముఖ కవి డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు శత జయంతి సభ స్థానిక మహారాణి కళాశాలలో నేడు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయ్, కరస్పాండెంట్ జాస్తి రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ ఆలపాటి సుబ్బారావు పాల్గొంటారన్నారు. ఈ సభలో డాక్టర్ పోచిరాజు సాహిత్యంపై డాక్టర్ జోష్యుల కృష్ణబాబు, గురుత్వంపై కొరుప్రోలు గౌరీనాయుడు ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఈ సభలో జాస్తి రమేష్, ఆర్ ప్రభాకర రావు, టీవీ రాఘవరావు, షేక్ ముస్తఫా, డాక్టర్ జి ధర్మరాజు, టి వి వి సత్యనారాయణ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతుల ప్రారంభం

గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలను సిద్ధం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణా తరగతులు మంగళవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభం అయ్యాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాజులూరు గ్రామాల అభివృద్ధి అవసరమైన ప్రణాళికను రూపొందించే లక్ష్యంతో చేపట్టిన శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ జె.రాంబాబు మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన ప్రణాళికపై ఆయన అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాల య సిబ్బంది పాల్గొన్నారు. **యు. కొత్తపల్లి** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్ పాల్గొని ప్రణాళికబద్ధంగా గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, సర్పంచులు, తదితర అధికారులు పాల్గొన్నారు**గొల్లప్రోలు** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.స్వప్న, ఎపిఎం సన్యాసిరావు, పంచాయతీరాజ్ అధికారి విద్యాసాగర్‌కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసా దేవి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. **గండేపల్లి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపిపి చలగల దొరబాబు, ఎంపిడిఒ నాతి బుజ్జి పాల్గొని శిక్షణ ఇచ్చారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికపై వారు మాట్లాడారు. ఈ శిక్షణ పరిశీలకులుగా ఎపి ఎస్ఐఆర్‌డి నుంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి, ఎంపిపి బొబ్బర సత్తిబాబు, ఇఒపిఆర్‌డి ఎం.భైరవమూర్తి, మాస్టర్ ట్రైనీలు, అధికారులు పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. **పెదపూడి** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నరేంద్రరెడ్డి, ఇఒపిఆర్‌డి ఎం.సత్యనారాయణరెడ్డి పాల్గొని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ గంగాధర్, ఎపిఎం అరుణ పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా తరగతుల్లో ఎంపిపి రాయుడు సునీత, ఎంపిడిఒ ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్స్ దేవిడ్‌రాజు, లలిత నిర్మల వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **రౌతులపూడి** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ప్రారంభం అయింది. ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, ఎంపిపి గంటిమల రామలక్ష్మి పాల్గొని గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళికను వివరించారు. **కరప** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు జరిగే శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అనుపమ పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివా సరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వర్ధన్, రత్న కుమారి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించి, శిక్షణాతరగతులకు ఎంపిడిఒ శ్రీ లలిత అధ్యక్షత వహించారు. ఈ శిక్షణా తరగతులను జడ్‌పి సిఇఒ వివి. లక్ష్మణ్‌రావు పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చౌదరి, ఇఒపిఆర్‌డి రమణ, కార్యాలయ ఎఒ సత్యనారాయణ మూర్తి, ఎఇఒ ప్రసాద్ పాల్గొన్నారు

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు

భూ సంబంధమైన రెవెన్యూ సమస్యలను పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సి హెచ్.వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని ఉలిమేశ్వరం, తిరుపతి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సామర్లకోట మండలం పవర గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.చంద్రశేఖరరెడ్డి పాల్గొని మాట్లాడారు. గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలులో గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 37వ పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో పెన్షనర్స్ సంఘ అధ్యక్షులు ఎంఎస్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన సభలో పెద్దాపురం సబ్ ట్రెజరీ అధికారి కాళీకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు సుధాకర్ మాట్లాడారు. 75 సంవత్సరాలు వయసు నిండిన పెన్షనర్లను సత్కరించారు. **ఏలేశ్వరం** స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో ఎండి ఇబ్రహీంఖాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పత్తిపాడు సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎండి సలీంఖాన్ పాల్గొని మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు రావలసిన పెన్షన్‌తో పాటు ఇతర ప్రభుత్వ రాయితీలు వెంటనే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. అనంతరం సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. **సామర్లకోట** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వి పల్లేశ్వరరావు, జివి రాఘవ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.లీలాశ్రీదేవి, పెద్దాపురం సబ్ ట్రెజరీ ఆఫీస్ ఎటిఒ ఎ.కాళీకృష్ణ, తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి, సిఐ కృష్ణభగవాన్, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యలను పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు.